క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో అన్నదానం



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

సీతంపేట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వాహనాల వేలం రేపు

జియ్యమ్మవలస: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 24న వేలం వేయనున్నట్లు చినమేరంగి ఎస్సై కళాధర్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు రూ. 1000 కాషనరీ ఫీజుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. వాహనాలు దక్కించుకున్నవారు పాడిన మొత్తంతో పాటు 18 శాతం జీఎస్టీని వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ వేలంలో 10 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ఉన్నాయన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం

భామిని: మండలంలోని బాలేరు అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు బాలేరు సంఘ అధ్యక్షుడు అగూరు సంజీవస్వామి ఆచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కుల వృత్తులు చేసుకొని జీవిస్తున్న విశ్వబ్రాహ్మణుల సమస్యలపై, మండల కమిటీ ఎన్నికపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యులతో పాటు విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారంతా హాజరుకావాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



బోను నారాయణ స్వామి(ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస పంచాయతీ మాజీ సర్పంచ్ బోను నారాయణస్వామి (80) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో స్వగృహంలో మృతి చెందారు. ఆయన సర్పంచ్‌గా సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించడంతో పాటు గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఎంపీపీ ఉరిటి రామారావు, డి.సత్యనారాయణ, వీరేష్ చంద్రదేవ్‌తో పాటు పలువురు నాయకులు శనివారం నారాయణస్వామి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు.

నేటి నుంచి మహాభాగవత సాప్తాహం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 29 వరకు మదాంధ్ర మహాభాగవత సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ బీఎల్ నగేష్ తెలిపారు. బమ్మెర పోతన రాసిన మదాంధ్ర మహాభాగవతంను విశ్రాంత తెలుగు పండితులు పెంట సింహాచలం పారాయణం చేయనున్నట్లు చెప్పారు. చివరి రోజు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు.

భూసర్వేతో రైతులకు ప్రయోజనం



మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు

భామిని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సమగ్ర రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. మండలంలోని చిన్నదిమిలి గ్రామంలో భూసర్వేపై శనివారం గ్రామసభ నిర్వహించారు. సర్వే సిబ్బంది గ్రామానికి వచ్చినపుడు రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలతో వారిని సంప్రదించి, దగ్గరుండి భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. ఏమైనా పొరపాట్లు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌కుమార్, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓ వినోద్‌కుమార్, సర్పంచ్ లోతుగెడ్డ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు అగతముడి రఘు, బోడ్డేపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో భారీ వాహనం



ఏబీ రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనం

భామిని: మండలంలోని ఏబీరోడ్డు మీదుగా నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. విశాఖపట్నం షిప్‌యార్డు నుంచి ఛత్తీస్‌గఢ్ వెళ్లే ఓ భారీ కంటైనర్ శనివారం భామిని చేరుకుంది. 110 టైర్లతో ఉన్న ఈ వాహనాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఇరుకు రోడ్డు కావడంతో వాహనం ముందుకు కదలడం కష్టంగా మారింది. ఆ సమయంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ వైర్లు కంటైనర్‌కు తగలకుండా కర్రలతో పైకెత్తి పట్టుకోవాల్సి వచ్చింది.

ప్రగతి 'బాట'లో గిరిజన గ్రామాలు

- మారుమూల గిరిజన గ్రామాలను కలుపుతూ రహదారుల నిర్మాణం
- ప్రారంభించిన ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



పాలకొండ: సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ:

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. మారుమూల గ్రామాలు, గిరిశిఖర గ్రామాలను మండల కేంద్రాలతో కలుపుతూ రహదారుల నిర్మాణం చేపడుతోంది. సరైన రోడ్లు లేక గిరిజనులు పడుతున్న కష్టాలు తీరిపోనున్నాయి. మండలంలోని డోలమడ గ్రామం నుంచి వంతవాడ, వంతవాడ కాలనీ వరకు రూ. 2.20 కోట్లతో నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సరైన నడక దారి కూడా లేని గ్రామాలకు నేడు సీసీరోడ్లు, బీటీరోడ్లు నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మరో రూ.8 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనీల్‌కుమార్, వ్యవసాయసలహా మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, బిడ్డిక వెంకయ్య, పాండ్రంకి హైమావతి, తిర్లంగి ఉపేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నరామ రహదారి ప్రారంభం



సీతంపేట: చిన్నరామ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు నుంచి చిన్నరామ గ్రామానికి రూ.50 లక్షలతో నిర్మించిన బీటీరోడ్డును శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ గిరిజన హేబిటేషన్‌కు రహదారి కనెక్టవిటీ ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. గతంలో రహదారులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని, అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు తీసుకువెళ్లాలన్నా, గిరిజనోత్పత్తులను మార్కెట్‌లకు తరలించాలన్నా అనేక అవస్థలు పడాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఇంకా ఎక్కడైనా నిర్మించాల్సి ఉంటే వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషణరావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్‌లు ఎస్.మౌనిక, హెచ్.ఆదిలక్ష్మి, ఎ.కళావతి, ఎస్.సుశీల, విజయలక్ష్మి, ప్రధాని, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎం.రామారావు, ఎస్.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



ప్రశస్త్ యాప్‌ను చూపుతున్న డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్, సహిత విద్య సమన్వయకర్త పి.భానుమూర్తి

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగులు) పిల్లలను గుర్తించేందుకు జిల్లా సహిత విద్య ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈనెల 17న ప్రారంభమైన ఈ సర్వే 28 వరకు కొనసాగనుంది. ఈ సర్వేలో గుర్తించిన చిన్నారుల వివరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ రూపొందించిన ప్రశస్త్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ యాప్‌లో 64 ప్రశ్నలను ప్రభుత్వం పొందుపరిచింది. ఉపాధ్యాయులు, ఐఆర్‌టీలు, హెచ్‌ఎంలు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. ఇందులో నమోదైన దివ్యాంగ చిన్నారులకు తగిన వైద్య సేవలు, సహాయక చర్యలు, సంక్షేమ పథకాలు, రాయితీలను ప్రభుత్వం కల్పిస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలోని 15 మండలాల్లో 260 మంది దివ్యాంగ చిన్నారులను గుర్తించి ప్రశస్త్ యాప్‌లో నమోదుచేసినట్లు జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త పి.భానుమూర్తి తెలిపారు.

పాఠశాలలో యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు



యువ పర్యాటక క్లబ్ సభ్యులతో ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రాచుర్యాన్ని కల్పించడం, తద్వారా పర్యాటక ప్రదేశాల విశేషాలను విద్యార్థులకు తెలియజేసి వారిని వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహదపడతాయని గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బిడ్డిక భీముడు అన్నారు. పాఠశాలలో శనివారం యువ పర్యాటక క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, పర్యాటక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పండుగలు, జాతరలు, సంప్రదాయాలు, కళారూపాలపై నేటితరం యువతకు, భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.మురళీధరరావు, ఎ.సూర్యప్రకాశరావు, శ్రీహరి, త్రినాథరావు, కె.చంద్రమౌళి తదితరులున్నారు.

రోడ్డు పనుల పరిశీలన

సీతానగరం: మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పీఆర్ ఏఈ చంద్రమౌళి అన్నారు. నీలకంఠాపురంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడప కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల్లో సీసీ రోడ్డు, కాలువలు నిర్మించాలని కోరడంతో ఎమ్మెల్యే జోగారావు స్పందించి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. దీంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని నిర్వాహకులు గోపాలనాయుడుకు సూచించారు.

మహిళలపై అఘాయిత్యాలను అడ్డుకోవాలి



మణిపూర్ ఘటనను ఖండిస్తూ నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: మణిపూర్‌లో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవాలని, రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం సీఐటీయూ కమిటీ కార్యదర్శి కాద రాము నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలను తీవ్రంగా ఖండించారు. రెండు తెగల మధ్య వైరం కారణంగా మూడు నెలల్లో దాదాపు 150 మంది బలైపోయారని, కేంద్రం తక్షణమే కలుగజేసుకుని ఆ రాష్ట్రంలో శాంతి స్థాపనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.దుర్గారావు, కె.రామకృష్ణ, బి.పోలినాయుడు, కె.సూర్య, తదితరులు పాల్గొన్నారు.

పాడైన ట్రాన్స్‌ఫార్మర్.. నిలిచిన నీటి సరఫరా

వీరఘట్టం: ఇటీవల కురిసిన వర్షాలకు వండవ కొండపై ఉన్న ఉపరితల రక్షిత మంచినీటి పథకానికి నీరు పంపిణీ చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ధీలేశ్వరరావు శనివా రం తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు 5 రోజుల సమయం పడుతుందన్నారు. అప్పటివరకు తలవరం, పనసనందివాడ, ఎం.వి.పురం, కుమ్మరిగుంట, నీలానగరం, తెట్టంగి, బిటివాడ, అడారు, వండవ, పాలమెట్ట, చిదిమి, యు.వెంకమ్మపేట, తూడి, రేగులపాడు, కత్తులకవిటి, హుస్సేనుపురం, ఎం.రాజపురం, కుంబిడి, గదబవలస తదితర పంచాయతీల పరిధిలో ఉన్న 27 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చురుగ్గా ఓటర్ల జాబితా పరిశీలన



భామిని: ఘనసరలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు



జియ్యమ్మవలస: బిత్రపాడులో బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

పాలకొండ/భామిని/గరుగుబిల్లి/జియ్యమ్మవలస: పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఓటర్ల జాబితాల పరిశీలన కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. బీఎల్‌ఓలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. మృతి చెందిన, ఇతర ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పర్చుకున్న ఓటర్లను వారి కుటుంబ సభ్యుల అనుమతితో జాబితాల నుంచి తొలగించే చర్యలు చేపడుతున్నారు. అలాగే పేరు, ఇంటి నంబరు, అడ్రస్, ఇతర వివరాలు తప్పుగా నమోదై ఉన్నట్లయితే వాటిని సవరించడంతో పాటు 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఓటుహక్కు నమోదు చేసేందుకు అవసరమైన ధరఖాస్తులు పూర్తిచేస్తున్నారు. భామిని మండలం ఘనసరలో చేపట్టిన సర్వేను తహసీల్దార్ నీలాపు అప్పారావు శనివారం పరిశీలించారు. పాలకొండ మండలంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఓటరు జాబితాల పరిశీలనపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఆర్ఐ మండంగి కృష్ణ పరిశీలించారు. జియ్యమ్మవలస మండలం బిత్రపాడు, నిమ్మలపాడు గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదును తహసీల్దార్ కేవీ సీతారామయ్య పరిశీలించారు.

బ్రెయిన్ సర్జరీ విజయవంతం



భర్త గణపతితో సుజాత

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో చేపట్టిన బ్రెయిన్ సర్జరీ విజయవంతమైంది. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రి ఎండీ డాక్టర్ డి.రాజేంద్ర వెల్లడించారు. రేగిడి మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన గెంబలి గణపతిరావు ఈ ఏడాది మార్చి 18వ తేదీన ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో కాలు విరిగి, తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు కేర్‌కు తీసుకురావడంతో అన్నిరకాల పరీక్షలు చేసి, వారి అనుమతితో ఆపరేషన్‌కు చేశామన్నారు. బాధితుడికి న్యూరోసర్జన్ డాక్టర్ కిశోర్, ఎనస్తీషియా కిరణ్‌లు 25 రోజుల పాటు ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచారన్నారు. ప్రమాదకర పరిస్థితి నుంచి ప్రస్తుతం బాధితుడు బయటపడ్డాడన్నారు. ఇటువంటి క్రిటికల్ సర్జరీలు ఇంతకుముందు విశాఖపట్నంలో మాత్రమే జరిగేవని, ఈ ప్రాంత వాసులు ఎక్కడకు వెళ్లాల్సిన పనిలేకుండా అందుబాటులో ఉన్నాయన్నారు.

'ఆరోగ్యశ్రీ'తో పునర్జన్మ

నా పేరు గెంబలి సుజాత. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం నా భర్త గణపతికి పునర్జన్మనిచ్చింది. రోడ్డు ప్రమాదంలో నా భర్తకు కాలు విరగడంతో పాటు తలకు తీవ్రగాయమైంది. బ్రెయిన్ సర్జరీ చేయాల్సి రావడంతో పెద్దమొత్తంలో డబ్బులు కావాల్సి వచ్చింది. చిన్న కిరాణా షాపు ద్వారా జీవనం సాగిస్తున్న తమకు ఇంత పెద్దకష్టం వస్తుందనుకోలేదు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే రాజాం కేర్ ఆస్పత్రికి తరలించి, తమ పరిస్థితిని వైద్యులకు వివరించాం. శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు అవుతుందని, ఆరోగ్యశ్రీ వర్తిస్తే ఇక్కడే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వైద్యులు సలహా ఇచ్చారు. ఇప్పుడు ఆపరేషన్ విజయవంతమై నా భర్త ఆరోగ్యం బాగుంది. ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పులిపుట్టి గ్రామ సచివాలయం పరిధిలో వెంపలగూడ, రేగులగూడ, పాతరేగులగూడ, బిల్లమడ, కె.గుమ్మడలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఏవైనా సాంకేతిక ఇబ్బందుల కారణంగా ఎవరికైనా పథకాలు అందనట్లయితే అటువంటి వారిని గుర్తించి వారికి పథకాలు వర్తింపచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో హౌసింగ్, తాగునీరు, డ్రైనేజి వంటి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.వెంకటేష్, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ మేలు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వీరఘట్టం: నీలానగరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్



జియ్యమ్మవలస: బిత్రపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శశికళ



గుమ్మలక్ష్మీపురం: చినగీసాడలో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న తహసీల్దార్ రాములమ్మ, సర్పంచ్ నిమ్మక శాంతి



వీరఘట్టం: పనసనందివాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ కిరణ్‌కుమార్

వీరఘట్టం: అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని నీలానగరం గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు అర్జీదారులకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పనసనందివాడలో డ్వామా పీడీ పి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జగన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

కురుపాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని తిత్తిరి పంచాయతీలో ఎంపీడీఓ వి.శివరామప్ప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందలేని వారికి సత్వర న్యాయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ, ఎంపీటీసీ గయామి, నాయకులు జగన్నాథరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చినగీసాడ సచివాలయం వద్ద తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో, బాలేసు సచివాలయం వద్ద ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు.

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, పెదబుడ్డిడి గ్రామాల్లో ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ కేవీ సీతారామయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. బిత్రపాడులో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.శశికళ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్ హాజరై లబ్ధిదారులకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందజేశారు.



కురుపాం: తిత్తిరి గ్రామ సచివాలయంలో అర్జీదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న డీపీఓ సత్యనారాయణ, తదితరులు

రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్ మోహనరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహనరావు

మక్కువ: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి. జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని వెంకట భైరిపురం జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి, క్రమంతప్పకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. ముఖ్యంగా కిశోర బాలికల్లో రక్తహీనత నివారించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వెంకటభైరిపురం, కొయ్యానపేట గ్రామాల్లో గల గర్భిణులను నేరుగా ఇంటికి వెళ్లి కలిసి ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.